ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ మంగళవారం । 9 డిసెంబర్ 2025 । ■ 11 పేజీలు

# ప్రలోభాలు ఘరూ..

## నేటితో ముగియనున్న తొలివిడత ప్రచారం

■ ఇప్పటికే గ్రామాల్లోకి మద్యం డంపు ■ ఒక్కో ఓటుకు వెయ్యి నుంచి 3 వేల వరకు పంచేందుకు ప్రణాళికలు

■ నగరాల్లో ఉండే ఓటర్లకు వల ■ ముందస్తుగా ఆన్‌లైన్ పేమెంట్ ■ ఎక్కడ చూసినా సిట్టింగులే..

■ ఒకరిని మించి ఒకరు ఖర్చు ■ ఆ ఓటరు నాడిని పట్టేందుకు అభ్యర్థుల చివరి ప్రయత్నం

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత నిర్వహించనున్న గ్రామ పంచాయతీలకు నేటి సాయంత్రంతో ప్రచారం ముగనుంది. 11 వతేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులు చివరి అవకాశంగా ప్రలోభాలకు తెరలేపారు. నయానో భయానో ఎలాగైనా గెలిచితీరాలని డబ్బు, మద్యంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్వం సిద్ధం చేశారు. ఏ వాడ ఓటర్లకు ఆ వాడలో ప్రత్యేక సిట్టింగులు ఏర్పాటు చేసేందుకు మద్యం డంపింగ్‌లు చేసి వారికి తాగినంత అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉపాధి కోసం నగరాల్లో ఉన్న ఓటర్లకు ఫోన్ పే ఇతరత్రా ఆన్ లైన్ ద్వారా ముందస్తుగానే నగదును వారికి ముట్టజెప్పే ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసుకున్నట్లు సమాచారం. గెలుపు కోసం అభ్యర్థులు ఒకరికి మించి ఒకరు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే ఓటర్ ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఉత్కంఠగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజర్వ్ స్థానాల్లో మాత్రం పోటీ మామూలుగానే సాగుతున్న జనరల్ స్థానాల్లో మాత్రం పోటీ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను తలపిస్తుంది.



10

## రిటర్నింగ్ అధికారులు ఎన్నికల్లో కీలకం

■ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ■ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో 2, 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్- 2 రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో స్టేజ్- 2 రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైందని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.



## కూలిన వంతెన..

నార్నూర్ మండలం మలంగి పంచాయతీ పరిధిలోని బారిక్ రావుగూడా సమీపం లోని వంతెన ఆదివారం రాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపా యాలతో రోడ్డు, వంతెన నిర్మాణ సమయంలో అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనతికాలంలోనే వంతెన కూలిపోయిందని ఆరోపించారు.



## ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించాలి

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా నితికా పంత్ సూచించారు. సోమవారం పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలందరు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు.





# శీతల భూతం
# చలి పంజా




9


■ ఆదిలాబాద్ అంతటా గజగజ ■ సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు..

■ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

■ ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 6.6 డిగ్రీల కనిష్ఠ టెంపరేచర్ ■ చలి పంజాకు వృద్ధుడు బలి..

■ గిరిజన గూడేలను కమ్మేసిన మంచు తెరలు.. వణుకుతున్న జనం ■ చలి మంటలతో ఉపశమనం

■ మరో మూడు రోజుల పాటు పెరగనున్న చలితీవ్రత ■ చలితీవ్రతతో జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



అడవుల జిల్లా ఆదిలాబాద్ చలికి వణికిపోతోంది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు అమాంతంగా పడిపోవడం, కేవలం సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరాది నుండి వీస్తున్న చలి గాలులతో జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. కొన్ని రోజులుగా వరకు సాధారణ ఉష్ణోగ్రతలే నమోదు కాగా గత రెండు మూడు రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఏజె న్సీ ప్రాంతాల్లోనైతే చలి ఇబ్బందు అన్నీఇన్నీ కావు. చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోవడం తో ప్రజలు చలి నుండి రక్షణ కల్పించేందుకు చలి మంటలు కాగుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తె చలి నుండి రక్షణకు స్వెటర్లు, మఫ్లర్లను ధరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జనాలు లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. ఓవైపు పోగామంచు కమ్ముకున్న దృశ్యాలు ప్రజలను అనువిందు చేస్తున్నప్పటికీ, మరోవైపు పొగమంచు కారణంగా రహదారులు కనబడగా వాహనదారులకు ఇబ్బందులు కలుగుతూ, ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.



# ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలి

- ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి..
- ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- ఉట్నూర్‌లోని పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఉట్నూర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)** ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రాలను, పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ముందుగా ఉట్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియను, ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కళాశాల వద్ద పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లోని సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కళాశాల వద్ద పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సిబ్బందిని నించుకోవాలని అన్నారు. భోజన వసతి, బ్యాలెట్ బాక్స్ ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంద్రవెల్లి ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియను, ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ను ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ముందస్తు ఏర్పాట్లు పరిశీలించుకొని, సందేహాల నివృత్తి కోసం మాస్టర్ ట్రైనర్ ల సహాయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల ఎంపీడీవోలు రామ్ ప్రసాద్, జీవన్ రెడ్డి, తహసిల్దార్ ప్రవీణ్, ఏం.ప్రవీణ్, ఆర్ఓలు, అధికారులు, పోలింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# గ్రామపంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత అధికారులతో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలు నిర్వహించే అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు కలగకూడదని అన్నారు. ఆన్లైన్ మాధ్యమం ద్వారా సమావేశంలో పాల్గొన్న తహసిల్దారులు, ఎంపీడీవోలకు మరొకసారి ఎన్నికల నిర్వహణ విధివిధానాలపై సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎన్నికల సిబ్బంది, సామాగ్రి తరలింపునకు సరిపడినన్ని వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ముధోల్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**ముథోల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు సోమవారం నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో బైంసా ఎఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడారు. ఫ్లాగ్ మార్చ్‌తో ప్రజల్లో నమ్మకం పెంపొందించడం, శాంతి భద్రతలు కాపాడడం, ప్రధాన ఉద్దేశం అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి, ఎన్నికల నియమాలు పాటించాలని ఆయన కోరారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరిగిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో కావాలని గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ధిక్కరించిన వారిపైచర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ముథోల్ సిఐ మల్లేష్, బాసర సిఐ సాయి కుమార్, ఎస్ఐలు బిట్ల పెర్సెస్, అశోక్, గంగాదర్, నవనిత్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## బాధితులకు భరోసాగా గ్రీవెన్స్ డే

**నిర్మల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)** ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడం, ప్రజా సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా కృషి జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.



## ఈవిఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

### మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల ఈ వి ఎం గోదాముడు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు.

## పంచాయతీ ఎన్నికలు స్కూళ్లకు సెలవులపై ప్రకటన

**ఆదిలాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)** పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 11న తొలి విడత పోలింగ్ జరగనుంది. ఈ నేప థ్యంలో స్కూళ్లకు రెండు రోజులు సెలవులు ప్రకటిస్తూ డీఈవోలు ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ జరిగే పాఠశాలలకు 10, 11న సెలవు ఉంటుందని పేర్కొ న్నారు. 10న పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల దృష్ట్యా, 11న పోలింగ్ ఉండటంతో సెలవులు ఇస్తున్నట్లు వెల్లడించారు.

## అభివృద్ధిని చూసి ఓటెయ్యండి : ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**జన్నారం, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)** గడిచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో చేపట్టిన అభివృద్ధిని చూసి తాము బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయాలని భారీ మెజారిటీతో గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. సోమవారం మండలంలో విస్తృత ప్రచారం చేసిన ఆయన కామనపల్లి, తొమ్మిది గుడిసెల పల్లె, కలమడుగు, మురిమడుగు, చింతగూడ, కిష్టాపూర్, మహమ్మదాబాద్, రోటి గూడ గ్రామాల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల తరఫున ఆయన ప్రచారం నిర్వహించారు పార్టీ బలపరిచిన అభ్యర్థులకు వస్తున్న స్పందన చూసి ఆయన ఆనందం వ్యక్తం చేశారు పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి మండల నాయకులు అందరూ ఒక్కతాటిపై వచ్చి కృషి చేయాలని ఆయన అన్నారు



# శాంతి భద్రతల కోసమే ఫ్లాగ్ మార్చ్



**బెల్లంపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

స్వేచ్ఛయుత ఎన్నికల నిర్వహణ, శాంతి భద్రత కోసమే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు తాళ్ళగురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రవెల్లి, చాకెపల్లి బుధకుర్ద్ గ్రామాలలో సోమవారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లోఅధికారులు, సిబ్బందితో కలిసి ముఖ్యమైన రహదారులు, గ్రామాలలోని వాడలలో పోలీసు బృందాలు కవాతు చేశాయి. పోలీసుల ఫ్లాగ్ మార్చ్ ప్రజలకు పోలీస్‌లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారనే నమ్మకం, శాంతి భద్రతపై భరోసా కల్పిం చాయి. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి అక్రమాలు, డబ్బు పంపి ణీలు, బెదిరింపులు, ఓటర్లపై ఒత్తిడి వంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. గ్రామాల్లో శాంతి భద్రత కాపాడేందుకు ప్రత్యేకంగా ఫ్లాగ్ మార్చ్, పెట్రోలింగ్ చేస్తున్నట్టు తెలి పారు. ప్రతి ఓటు విలువైనదనీ, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి అన్ని రకాల పటిష్టమైన భద్రత, బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛయుతంగా ఎన్నికలు జరగాలని, ప్రతి ఒక్క ఓటరు ఎలాంటి ప్రలోబాలకి, బెదిరింపులకి లోను కాకుండా పోలింగ్ స్టేషన్ కి రావడమే పోలీసుల లక్ష్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ. రవికుమార్, ఏసీపీ బెల్లంపల్లి రూరల్ సీఐ హెచ్. హనోక్, బెల్లంపల్లి సీఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



## బీజేపీ బలపరిచిన అభ్యర్థులను ఆదరించండి

### ఎంపీ గోడం నగేష్ పిలుపు

**తలమడుగు, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే గ్రామాల అభివృద్ధి అని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆలోచిం చి బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ గోడం నగేష్ కోరారు. తలమడుగు మండలంలోని సుంకిడిలో బీజే పీ పార్టీ కార్యకర్తలతో కలిసి ఎంపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులే అభివృద్ధికి దోహదం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు కనపర్తి చంద్రకాంత్, ప్రభాకర్, మాజీ రైల్వే బోర్డు మెంబర్ జీవి రమణ, మాజీ మండల అధ్యక్షులు స్వామి, మహేందర్, బోండ్ల వెంకటస్వామి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మామడలో కాంగ్రెస్ ప్రచారం



**నిర్మల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

మామడ మండలం వెంకటాపూర్, నల్లుర్తి గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పడాల శ్రీనివాస్ ను గెలిపించాలని కోరుతూ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరి రావు సోమవారం ఉదయం విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి, స్థానిక సమస్యలు, అభివృద్ధి అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీహరి రావు, గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీనే భరోసా అని పేర్కొన్నారు. సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తానూరులో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**ముథోల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తానూర్ మండల కేంద్రంలో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అవినాష్ కుమార్ మాటాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రజలందరికీ పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలు చైతన్యవంతులై ప్రజాస్వామ్య ఓట్లు వినియోగించుకోవాలని వివరించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి అనిత

**జన్నారం, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ నోడల్ ఆఫీసర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత వైద్య బృందంతో జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము సందర్శించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ స్టేషన్లలో నిర్వహించాల్సిన వైద్య శిబిరములను ఆశ ఆరోగ్య కార్యకర్తలు వైద్యులతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు ఆదేశాలు ఇవ్వడం జరిగినది ఇందులో భాగంగా ఉదయం ఆరు గంటలకి రిపోర్ట్ చేయాలి యూనిఫారంలో ఉండాలి మొబైల్ తీసుకువెళ్లరాదు మందుల వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారంగా స్థానిక నాయకులతో ప్రభుత్వ ఉద్యోగులు కలవద్దన్నారు.



కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ వైద్యాధికారి బుక్క వెంకటేశ్వర్ జిల్లా మాస్ మీడియా అధికారి ప్రశాంతి డిపిఓ వెంకటేశ్వర్లు సిహెచ్ లక్ష్మణ స్వామి గ్రామపంచాయతీకి కేటాయించిన వైద్య శిబిరం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఈ నెల 9వ తేదీన తలపెట్టిన తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అధికారులు, అనధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


## ఆహ్వాన పత్రం అందజేత



**నిర్మల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ మూడవ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ ఆలయ కమిటీ అధ్యక్షులు కొడుకుల గంగాధర్ ఆధ్వర్యంలో ఇంద్రకరణ్ రెడ్డికి సోమవారం ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో స్థానిక యూత్ నాయకులు శ్రీనివాస్ నరేష్ కమిటీ సభ్యులు ఉన్నారు.

## నిర్మల్ నుండి శబరిమలకు ప్రత్యేక బస్సులు



**నిర్మల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే పండరి తెలిపారు. శబరిమలైకి వెళ్లే అయ్యప్ప భక్తులు మిగతా భక్తులు ఆర్టీసీ సర్వీసులను ఉపయోగించుకోవాలన్నారు. కానిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, శబరిమల వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు మధురై నుండి నిర్మల్ కు చేరుకుంటుందని, 6 రోజుల ప్రయాణం ఒకరికి టికెట్ ధర 7650/- ఉంటుందని, ఎలాంటి టోల్ ట్యాక్సిలు, భార్డర్ టాక్స్‌లు ప్రయాణికుల వద్ద వసూల్ చేయమని ఆయన తెలిపారు. దర్శనానికి వెళ్లి వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుందని మరిన్ని వివరాలకు 9959226003, 8328021517, 7382842582 లో సంప్రదించాలని ఆయన కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



**ఆసిఫాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యాభ్యాసిస్తున్న విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లాలోని కెరమెరి మండలం సావర్‌ఖేఢా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాల, పరిసరాల పరిశుభ్రత, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలన్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో బోధన ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్నం భోజనం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అవసరమైన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది రాకపోకలు, సామగ్రి భద్రత, రవాణా సౌకర్యాలు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీ క్షించి, పొరపాట్లకు తావు లేకుండా విధులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

## అధికారంలో ఉన్న పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**సాత్నాల, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సాత్నాల మండలంలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుమని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో
# స్టేజ్-2 ఆర్‌వోల పాత్ర కీలకం

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగనున్న ఎన్నికల నిర్వహణలో స్టేజ్-2 ఆర్‌ఓల పాత్ర కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిలతో కలిసి మొదటి, రెండవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నిర్వహణలో భాగంగా స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని తెలిపారు. జిల్లాలో 3 విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎలాంటి పొరపాట్లకు, వివాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో ఎన్నికల కొరకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల సామాగ్రి, పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి మొదటిగా వార్డు సభ్యుల స్థానాలకు, అనంతరం సర్పంచ్ స్థానానికి ఓట్ల లెక్కింపు చేపట్టి, ఉప సర్పంచ్ ను ఎన్నుకోవాలని తెలిపారు. ఎన్నికలలో ఉపయోగించే సామాగ్రి కవర్లు, పోలింగ్ కేంద్రాలలో కుర్చీలు, టేబుళ్లు, వెలుతురు సక్రమంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కౌంటింగ్ ముందు పి ఓ డైరీ, బ్యాలెట్ పేపర్, అకౌంట్ పేపర్ సీల్, అకౌంట్ స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లను పరిశీలించారని, ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ చేపట్టాలని, జోనల్ అధికారులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని, పోలింగ్ కేంద్రంలో శాంతిభద్రతలపై పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ఉషన్న, ఆసిఫ్, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కుప్పలిన కూలిన వంతెన

**నార్నూర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మలంగి పంచాయతీ పరిధిలోని బారిక్ రావుగూడా సమీపంలోని వంతెన ఆదివారం రాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయాలతో రోడ్డు, వంతెన నిర్మాణ సమయంలో అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనతికాలంలోనే వంతెన కూలిపోయిందని ఆరోపించారు. సదరు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో సీసీరోడ్డుపై పగుళ్లు ఏర్పడి ఆదివారం రాత్రి ఒక్కసారిగా కూలి పోయిందని తెలిపారు. వంతెన కూలిపోవడం వల్ల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని గ్రామస్థులు వాపోయారు. వంతెనపై ప్రయాణ సమయంలో ఆదమరిస్తే అంతే సంగతి అంటూ వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కుభీర్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**కుభీర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
కుభీర్‌లోని శ్రీ విఠలేశ్వరాలయంలో సోమవారం అయ్యప్ప మహపడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పుప్పాల దేవన్న గురు స్వామి 18 సంవత్సరాలుగా మాలధారణ చేసిన నారికేళ గురుస్వామిని తోటి గురు స్వాములు, అయ్యప్ప స్వాములు ఘనంగా సత్కరించారు. ముందుగా గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలను రేపల్లెకు చెందిన తోట శివ శంకర్‌రావు గురుస్వామి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మెట్ల పూజ ఆకట్టుకుంది. హరిహర మ్యూజిక్ నిర్మల్ ఆర్కెస్ట్రా బృందం ఆలపించిన పాటలు, చిన్నారుల నృత్యాలు అలరింపజేశాయి. స్వామియే శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప శరణం.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో కుభీర్ పట్టణం మార్మోగింది. కార్యక్రమంలో



ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఆలయ కమిటీ అధ్యక్షులు పెంటాజి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం చేసిన వైద్యుడు : యువతి బలవన్మరణం

**ఆదిలాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
ప్రేమ పేరుతో వైద్యుడు ఓ యువతిని మోసం చేశాడు. తనను వివాహం చేసుకోవాలని లేదంటే ఫొటోలు వైరల్ చేస్తానని బెదిరించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన యువతి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన మహ్మద్ షోయబ్ అలీ ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్‌లో హౌస్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. యువతి సదాఫ్ సుల్తానా (20) రిమ్స్‌లో బీఎస్సీ (అనస్థీషియా) టెక్నీషియన్ కోర్సు చదువుతోంది. వీరిద్దరూ గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. కొన్ని కారణాలతో ఆమె గత కొంత కాలంగా అతడితో మాట్లాడడం లేదు. ఈ క్రమంలో డా.మహ్మద్ షోయబ్‌కు వివాహం జరిగి, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఆమెకు తెలిసి నిలదీసింది. అయినప్పటికీ తనను వివాహం చేసుకోవాలని, లేదంటే తన వద్ద ఉన్న ఫొటోలను వైరల్ చేస్తానని బెదిరించడంతో మనస్తాపానికి గురైన యువతి గత నెల 26న ఆత్మహత్యకు యత్నించింది. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.



## విత్తన బిల్లులో సవరణలు చేపట్టాలి

**ఆదిలాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
కేంద్రం ప్రవేశ పెట్టే నూతన సీడ్ బిల్లులో 2025లో రైతులకు, డీలర్స్ కి సంబందించిన కొన్ని సవరణలు కోరుతూ ఆదిలాబాద్ జిల్లా ఆగ్రో డీలర్స్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సోమవారం డీలర్స్ అందరూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టాఫీస్ కు చేరుకుని బిల్ లో సవరణలను చేసే అంశాలను, తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ లిఖిత పూర్వకంగా వ్యవసాయ మంత్రిత్వ శాఖకి రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న రైతులు నూతన సవరణ ద్వారా నష్ట పోయే అంశాలను, ఇక్కడ ఉన్న వ్యవసాయ పరిస్థితులను అర్థం చేసుకుని నష్ట పరిహారానికి సంబంధించిన సవరణను పొందుపర్చాలని, రైతులను ఆదుకోవాలని డీలర్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో డీలర్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, కంఠం శంకర్, గంద్రత్ సంతోష్, కత్తూరి ప్రశాంత్, కిషోర్, రాజ్ కుమార్, శ్రీకాంత్, నాళం రాకేష్, ప్రకాష్ రెడ్డి, వాసవి శ్రీనివాస్, రేణుకా సతీష్ , వివిధ మండలాల్లో ఉన్న డీలర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి పాటించాలి

**ఇంద్రవెల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో పోలీసులు సూచించిన నియమాలను పాటించాలని ఇంద్రవెల్లి ఎస్ఐ సాయన్న తెలిపారు. పోలింగ్ కేంద్రాల 100, 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు గుమిగూడరాదని సూచించారు. సెల్ ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్ వంటివి పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించబడవని, క్యూ పద్ధతిని పాటించాలని ఆయన పేర్కొన్నారు.




## ఎన్నికల నియమాలను పాటించాలి : తలమడుగు ఎస్సై రాధిక

**తలమడుగు, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలో జరిగే ప్రతి ఒక్క గ్రామంలో పోలీసులు సూచించిన నియమాలను పాటించాలని తలమడుగు ఎస్ఐ రాధిక తెలిపారు. పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలు భరోసా కల్పించేందుకు గ్రామాల్లో పోలీసులు కవాతులు నిర్వహిస్తున్నారు. ఎస్ఐ రాధిక మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు. వాట్సాప్ లో, సోషల్ మీడియాలో ఇతరులను రెచ్చగొట్టేలా, కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడవద్దన్నారు. ఎన్నికలు



పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అధికారుల అనుమతితో నిర్ధారించిన రోజులలో అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలి.



# మా ఓట్లు అమ్మబడవు

**కాసిపేట, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, దానిని సరైన పద్ధతిలో వాడుకోవాలని ఒక్కరు ఒక్కో పద్ధతిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం సోమగూడెం భరత్ కాలనీలో మాకు నచ్చిన వారికి స్వచ్ఛందంగా ఓట్లు వేస్తామని, మా ఓట్లు అమ్మబడవని ఇంటి ముందు బోర్డులు పెట్టారు. సోమగూడెంకు చెందిన ఓం సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సిరిపోతుల కుమార్ తన ఇంటి ముందు మా ఓట్లు డబ్బులకు, మందుకు, వస్తువులకు అమ్మబడవని, మాకు నచ్చిన వారికి ఓట్లు వేస్తామని, ఇబ్బందులు పెట్టద్దని ఇంటి ముందు బోర్డు పెట్టారు. ఎవరూ కూడా ఇబ్బందులు పెట్టవద్దని, ఎటువంటి ప్రలోబాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలనే ఉద్దేశంతో ఇలా ఇంటి ముందు బోర్డులు పెట్టామని సదురు ఉపాధ్యాయులు సిరిపోతుల కుమార్ తెలిపారు. ఎవరూ కూడా ప్రలోబాలకు లొంగకూడదని అనే సంకల్పమని తెలిపారు. కుమార్ తీసుకున్న నిర్ణయం పలువురిని ఆలోచింపజేసింది.

# మంచిర్యాలలో రోడ్డు ప్రమాదం

## ఒకరు మృతి, మరొకరికి గాయాలు



**మంచిర్యాల, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిలా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన కొండపర్తి సందీప్ (26) అనే వ్యక్తికి నాలుగేళ్ల క్రితం కావ్య అనే మహిళతో వివాహం జరిగింది. తన భార్యతో కలిసి శ్రీరాంపూర్ లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి సందీప్ తన తోడల్లుడైన ఓదెలకు చెందిన సుమన్‌తో కలిసి శ్రీరాంపూర్ నుండి మంచిర్యాలకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. కాలేజ్ రోడ్డు సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో కింద పడ్డారని తెలిపారు. ఈ ప్రమాదంలో సందీప్ అక్కడికక్కడే మృతిచెందగా సుమన్ కు తీవ్ర గాయాలైనాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని సందీప్ మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సుమన్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం సందీప్ ఐఎన్టీయూసి ఏరియా వైస్ ప్రెసిడెండ్ శంకర్‌రావు దగ్గర డ్రైవర్‌గాపని చేస్తున్నాడు.

# ట్రాక్టర్ ప్రమాదంలో మహిళ మృతి

**సారంగాపూర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
సారంగాపూర్ మండలం చించొలి (బి) గ్రామంలో రాత్రి జరిగిన దుర్ఘటనలో ఒడిశాకు చెందిన భానుమతి (30) అనే మహిళ మృతి చెందింది. ఆమె భర్త జగమండ్ నడుపుతున్న ట్రాక్టర్పై ప్రయాణిస్తుండగా, అతివేగం, నిర్లక్ష్యపు బ్రేకింగ్ వల్ల కిందపడి తలకు తీవ్ర గాయాలైంది. నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించాలి





**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్పీ నితికా పంత్ సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలో ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలందరు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని, ఎవరైనా గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడడం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించడం లాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ప్రజలు ఎన్నికల నియమాలను పాటించాలని, డబ్బులు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ బాలాజీ వరప్రసాద్, ఎస్సైలు పాల్గొన్నారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లో సోమ వారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాలాజీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసులు ముందుంటారన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియ మావళికి లోబడి నడుచుకోవాలని సూచించారు. ఎస్సై అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చిన్ను ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వాహనాల తనిఖీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, మత్తు పదార్థాలు, బెట్టింగ్ కార్యకలాపాలు వంటి నేరాలను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



**దండేపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
ఈనెల 11 నిర్వహించే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది గ్రామ పంచాయతీ ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని మంచిర్యాల డీఎల్పీవో ధర్మరాణి సూచించారు. సోమవారం దండేపల్లిలో మండల పరిషత్ కార్యలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికలో విధులు నిర్వహించే పివోలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ తీరును ఆమె పరిశీలించారు.. ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, సహాయక పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు కీలకమని, ఎన్నికల అధికారులు తగు జాగ్రత్తలు పాటించి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించే విధంగా కృషి చేయాలన్నారు. ఎన్నికల సామగ్రిని, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే తీరును ఆమె పరిశీలించారు. ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపివో విజయప్రసాద్ ఉన్నారు.

# ఎన్నికల నియమావళిపై సర్పంచ్, వార్డు అభ్యర్థులకు అవగాహన



**తాండూర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
మండలంలో ఈ నెల 14న నిర్వహిస్తున్న రెండవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నియమావళి పై సర్పంచ్, వార్డు అభ్యర్థులకు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సహాయ అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహనలో జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణాధికారి రాజేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ నెల 14న నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్థనా నియమావళిని పాటించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించొద్దని తెలిపారు. ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. వాహనాలు, మైక్ పర్మిషన్, ఇతర విషయాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. మండల ఎన్నికల సహాయ వ్యయపరిశీలకురాలు రశ్మిని, తహసీల్దార్ జ్యోత్స్న, సీఐ దేవయ్య, ఎస్సై కిరణ్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.



# ఆర్టీజన్ల సమస్యలపై రాజీలేని పోరు

**బెల్లంపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న ఆర్టీజన్లు, విద్యుత్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం కంపెనీలెవల్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు బొమ్మ సత్తిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం బెల్లంపల్లిలోని తాపీ కార్మిక సంఘం భవనంలో జరిగిన యూనియన్ డివిజన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీజన్ల సమస్యల పరిష్కారం కోసం కంపెనీ స్థాయిలో అతి త్వరలోనే సమ్మెకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఉద్యోగులందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కంపెనీ పరిధిలోని 16 జిల్లాల్లో ఇప్పటికే పలు జిల్లాల్లో కమిటీలను బలోపేతం చేశామని, 1999 నుంచి 2004 మధ్య నియమితులైన వారికి జీపీఎఫ్ వర్తింపజేస్తామన్న ప్రభుత్వ ప్రకటన సరికాదని, ఆ తర్వాత నియమితులైన విద్యుత్ ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక..**
ఈ సమావేశంలో బెల్లంపల్లి డివిజన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా జి. పుండలీక్ రావు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కాంద్రాపు నరేష్, కార్యదర్శిగా అముదాల మార్కండేయ, అదనపు కార్యదర్శిగా గుండపు శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) కంపెనీ లెవల్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు సతిరెడ్డి, జిల్లా కార్యదర్శి కొండయ్య సమక్షంలో జరిగాయి. సమావేశంలో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ కార్యదర్శి మేకర్తి చంద్రయ్య, సీనియర్ నాయకులు మాచర్ల వెంకటేశం, మాల మల్లేష్, గుర్రం చంద్రమౌళి విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గమధుకర్ మృతికి కారకులైన వారిని అరెస్టు చేయాలి

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్




బెల్లంపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) బీజేపీ నేత మధుకర్ మృతికి కారకులను అరెస్టు చేయకపోతే బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు, బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయాలను ముట్టడి చేస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి రమేష్ హెచ్చరించారు. బెల్లంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అనుచరులు రుద్రబట్ల సంతోష్, గాలి మధు, చింతకింద కమల వేధింపుల వల్లనే మధు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. ఈ విషయాన్ని మధు తన మరణ వాంగ్మూలంలో తెలిపాడని చెప్పారు. ఇప్పటివరకూ నిందితుల్ని పోలీసులు అరెస్టు చేయలేదని విమర్శించారు. నిందితులు అధికార పార్టీకి చెందిన వారు కాబట్టే పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ నిందితులను కాపాడుతున్నారని మండిపడ్డారు. బెల్లంపల్లి నియోజక వర్గంలో మొదటినుంచి రుద్రబట్ల సంతోష్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారనీ మండిపడ్డారు. గతంలో శివరామ్ హత్య వెనుక రుద్రబట్ల సంతోష్ హస్తం ఉందన్న అన్నారు. నిందితులు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ కోర్టు కొట్టివేసినా కూడా పోలీసులు నిందితుల్ని అరెస్టు చేయకుండా, వారికి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పోలీసులు నిందితులను అరెస్టు చేసి చట్టాన్ని గౌరవించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి, బీజేపీ లీడర్లు సూరం సంపత్ కుమార్, కొంక సత్య నారాయణ, అంగిలిశేఖర్, కమల పాల్గొన్నారు.



## సంతాజీ జగన్నాడే మహారాజ్ జయంతి వేడుకలు

ఆసిఫాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆసిఫాబాద్ కేంద్రంలోని దస్నాపూర్‌లో సంత్ శిరోమణి శ్రీ సంతాజీ జగన్నాడే మహారాజ్ 401వ జయంతి వేడుకల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంతాజీ జగన్నాడే మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, అఖిల గాండ్ల తెలి సంఘం జిల్లా అధ్యక్షుడు హివ్రే సందీప్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మెంగ్రే ఆకాష్, కోశాధికారి మెంగ్రే సంతోష్, మండల అధ్యక్షుడు బిజ్జు, వివిధ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



నిర్మల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) నిర్మల్ జిల్లా గ్రామ పరిపాలన అధికారుల సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి అధ్యక్షులుగా ఏ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా నరేష్ కుమార్ జయరాజ్ కార్యనిర్వహక అధ్యక్షులుగా కిరణ్ కుమార్ రెడ్డి కోశాధికారిగా మల్లయ్య మహిళా కార్యదర్శిగా ఉపాధ్యక్షులుగా శివారెడ్డి వెంకటయ్య జిల్లా కార్యదర్శిగా మల్లికార్జున్ ప్రచార కార్యదర్శిగా నాగరాజు క్రీడల కార్యదర్శి సన్మానం చేశారు.

## రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి



మందమర్రి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో 56వ రక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకొని కార్పొరేట్ రక్షణ కమిటీ కన్వీనర్ సైదులు, ఏరియా జీఎం రాధాకృష్ణ గనిని తనిఖీ చేశారు. రక్షణ బృందం సభ్యులు గని లోపలికి వెళ్లి రక్షణ సదుపాయాలను పరిశీలించారు. రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వారు తెలిపారు.

## గుడుంబా పట్టివేత

భీమిని, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) భీమిని మండలంలోని పెద్దపేట గ్రామంలో గుడుంబా అమ్ముతున్న వ్యక్తితో పాటు నాటుసారా పట్టుకున్నామని భీమిని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు సోమవారం పెద్దపేట గ్రామ వాగు వద్ద గుడుంబా అమ్ముతున్న షేక్ ఇస్మాయిల్ ని అదుపులోకి తీసుకొని, 5 లీటర్ ల గుడుంబాని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడిలో పోలీసులు ప్రవీణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

# శాంతిఖనిలో 56వ రక్షణ పక్షోత్సవాలు




బెల్లంపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) 56వ రక్షణ పక్షోత్సవాలులో భాగంగా సేఫ్టీ కమిటీ కన్వీనర్ శ్రీ బి.సైదులు జీ.ఎం, కార్పొరేట్, మందమర్రి ఏరియ జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ జి.ఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ కె.రఘు కుమార్, సేఫ్టీ ఆఫీసర్ ఎన్ భూశంకరయ్య బృందం సోమవారం మందమర్రిలోని శాంతిఖని గనిని తనిఖీ చేసింది. గనిలో దిగిన బృందం రక్షణ సదుపాయాలను పరిశీలించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని కార్పొరేట్ రక్షణ కమిటీ కన్వీనర్ ఎన్విరాన్మెంట్ జీఎం బి.సైదులు, మందమర్రి ఏరియ జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ అన్నారు. రక్షణ కోసం ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పరికరాలను పనిముట్లను వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని అన్నారు. శాంతి కని లోని కన్వేయర్ బెల్ట్ 15 నుంచి 16 గంటల వరకు నడిపించాలని, అందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలన్నారు. గనిలో అనుకోకుండా ప్రమాదాలకు గురైనప్పుడు ఉద్యోగికి అందించే (ఫస్ట్ ఎయిడ్) ప్రథమ చికిత్స గురించి ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో ఫస్ట్ ఎయిడ్ మెంబెర్స్ వారికి వివరించారు. అనంతరం కమ్యూనికేషన్ సెల్ మందమర్రి ఏరియ వారిచే రక్షణ జాగ్రత్తల గురించి వివరిస్తూ ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో లఘు నాటిక అందరినీ ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, పి శ్రీనివాస్, డీజీఎం, (ఓ/ఓ) జి.ఎం, సముద్రాల శ్రీనివాస్, డివై ఎస్.ఇ ఈఅండ్ఎం, (ఐ అండ్ పి) ఎం, కార్పొరేట్, బి.దేశాయ్, డీజీఎం సర్వే, శ్రీ బి మహేందర్ జూనియర్ సర్వే ఆఫీసర్ వకీల్ పల్లి ఆర్టీ 2, షేక్ కమ్రుద్దీన్, అడిషనల్ మేనేజర్ ఎంవీటీసీ శ్రీరాంపూర్ ఏరియా, సొండ్ స్టోయింగ్ మెంబర్, సునీల్ కుమార్ అడిషనల్ మేనేజర్ ఎన్విరాన్మెంట్ కార్పొరేట్, పి ఆదినారాయణ, మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్ రామగుండం 1, ఫస్ట్ ఎయిడ్ మెంబర్.కె. వెంకటస్వామి వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ మైనింగ్ వకీల్ పల్లి, పి. సందీప్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ఎలక్ట్రికల్ పీవీకే5, కే నాగమోహన్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ మెకానికల్ వి.కే ఓ.సి, శాంతిఖని గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హ సేఫ్టీ ఆఫీసర్ పి.రాజు, గని సంక్షేమాధికారి రవికుమార్, సీనియర్ అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ



ఆసిఫాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు తెలంగాణతల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని రహదారులు- భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. విగ్రహం వద్ద రంగుల పూలతో అలంకరించాలని, కార్యక్రమానికి వచ్చే వారికి తాగునీరు, టీ, అల్పాహారం అందించాలని తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమానికి 300 మంది విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల నిబంధనలపై అవగాహన సదస్సు

లక్సెట్టిపేట, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) మండలంలోని జెండా వెంకటాపూర్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికలను పురస్కరించుకొని పోలీసులు ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా డీసీపీ భాస్కర్ హాజరై పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ గ్రామంలో పలువురు ఇబ్బంది చేసిన, అల్లరులకు పలుపడే వారిని బైండ్ ఓవర్ చేశామని అన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలా జరగాలని, ప్రతి ఓటు మన గ్రామానికి ఎంతో బలమని అన్నారు. అక్రమాలకూ, డబ్బు, మద్యం ప్రలోభాలకు లోనుకా కుండా ప్రతి ఓటరు బాధ్యతతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. స్వచ్ఛమైన, న్యాయబద్ధమైన ఎన్నికలతో మంచి నాయకత్వం ఏర్పడుతుందని అన్నారు. అలాగే గ్రామస్తులు ఎన్నికల సమయంలో శాంతి భద్రతా నియమాలను పాటించాలని, అధికారులు, పోలీసులు అందరూ ప్రజల సహకారంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్ ఎన్నికల, సీఐ రమణమూర్తి, ఎస్ఐ గొపతి సురేష్, పోలీస్ సిబ్బంది అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పోలింగ్ సామగ్రి పరిశీలన

ఖానాపూర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం) మండలంలో స్థానిక ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రిని సోమవారం మండల అధికారులు పరిశీలించారు. సుమారు 168 పోలింగ్ కేంద్రాలకు గాను కావలసిన అన్ని రకాల సామాగ్రిని ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఖానాపూర్ ఎంపీడీవో రోమాకాంత్ సూచించారు. సమాగ్రి పంపిణీ 10వ తేదీ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సిహెచ్ రత్నాకర్ రావు, సిబ్బంది ఉన్నారు.



# ‘శంబాల’.. ఏ ఒక్కరినీ నిరాశపర్చదు..




‘శంబాల’ చిత్రం ఏ ఒక్కరినీ నిరాశపర్చదని, అందరినీ ఆకట్టుకునేలా ఉంటుందని కథానాయకుడు ఆది సాయికుమార్ అన్నారు. ఆయన హీరోగా యుగంధర్ ముని దర్శకత్వంలో నటించిన ‘శంబాల’ చిత్రం ఈనెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం భీమవరంలో సందడి చేసింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నటుడు ఆది మాట్లాడుతూ.. కంటెంట్ బాగుంటేనే జనాలు థియేటర్లకు వస్తున్నారని, అలాంటి డిఫరెంట్ కంటెంట్‌తో మీ ముందుకు వస్తున్నామన్నారు. ట్విస్టులు, టర్న్స్, సైన్స్, మూఢ నమ్మకాలు ఇలా అన్నింటినీ అద్భుతంగా చిత్రీకరించారని పేర్కొన్నారు. 1980 నాటి పల్లెటూరి వాతావరణంలో ఈ కథ కొనసాగుతుందని, మూఢనమ్మకాలతో నిండిన ఆ గ్రామంలో జరిగే అతీంద్రియ పరిణామాలు ప్రేక్షకులకు ఆసక్తి కలిగించేలా ఉంటాయన్నారు. భౌగోళిక శాస్త్రవేత్తగా ఓ ఛాలెంజింగ్ రోల్‌లో నటిస్తున్నట్లు ఆది చెప్పారు. ఈనెల 25న విడుదల అవుతున్న చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ.. ‘శంబాల’ లాంటి అద్భుతమైన చిత్రంలో మంచి పాత్రను పోషించడం ఆనందంగా ఉందన్నారు. తనను నమ్మి ఇంత గొప్ప పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు సినిమా చరిత్రలో ఎన్నడూ చూడని కథాంశంతో సినిమా తీశారన్నారు. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ఆది, అర్చన అయ్యర్, నటులు ఇంద్రనీల్ దర్శించుకున్నారు.



# ఓటీటీలోకి దుల్కర్ 'కాంత'

దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సె, సముద్రఖని ముఖ్య పాత్రల్లో నటించిన లేటెస్ట్ చిత్రం 'కాంత' బాక్సాఫీస్ దగ్గర పర్వాలేదు అనిపించుకుంది. కాగా ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉంది. డిసెంబర్ 12, 2025న తెలుగు మరియు తమిళ భాషలలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. అలాగే ఇతర భారతీయ భాషలలో కూడా ఈ సినిమా అందుబాటులోకి రానుంది.కాగా ఈ సినిమాకి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు, పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో దుల్కర్, భాగ్యశ్రీల పర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. ఈ సినిమాలో రానా దగ్గుబాటి కాప్ రోల్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేసింది. సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ప్రొడ్యూస్ చేశారు. మరి ఓటీటీలో ఈ సినిమా ఏ రేంజ్ విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# భాగ్యనగరిలో భారీ పోరాటం



‘దసరా’ విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న రెండో చిత్రం ‘ది ప్యారడైజ్’. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ప్రారంభించుకుంది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ సెట్‌లో నాని, రాఘవ్‌లతో పాటు కొందరు ఫైటర్లపై పోరాట ఘట్టాన్ని చిత్రీకరిస్తున్నారు. ఇది సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఫైట్లలో ఒకటని.. నెలాఖరు వరకు ఈ షెడ్యూల్ కొనసాగే అవకాశముందని తెలిసింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రంలో.. జడల్ అనే శక్తిమంతమైన రా రస్టిక్ పాత్రలో నాని కనువిందు చేయనున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు.

# ‘అఖండ 2’ ఇష్యూ క్లియర్..



బాలకృష్ణ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తోన్న చిత్రం ‘అఖండ 2’ . ఆర్థిక ఇబ్బందుల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడిన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని అందరూ ఆసక్తిగా ఉన్నారు. తాజాగా ఈ సినిమా ఇష్యూ క్లియర్ అయిందని టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. డిసెంబర్ 12న ‘అఖండ 2’ విడుదలయ్యే అవకాశం ఉందన్నారు ఈసందర్భంగా సినిమాల ఆర్థిక ఇబ్బందుల గురించి ఆయన మాట్లాడారు.“ఈ సంవత్సరంలో ‘హరిహరవీరమల్లు’. ‘అఖండ 2’ విడుదల విషయంలో ఇబ్బందులు వచ్చాయి. నిర్మాతలకు గతంలో ఉన్న ఆర్థికపరమైన కమిట్‌మెంట్‌ల కారణంగా ఇవి తలెత్తాయి. ‘హరిహర వీరమల్లు’ ఇష్యూ క్లియర్ కాగానే విడుదలైంది. ఇప్పుడు ‘అఖండ 2’ ఇష్యూ కూడా క్లియర్ అయింది. నా అంచనా ప్రకారం డిసెంబర్ 12న విడుదలయ్యే అవకాశం ఉంది. అందరూ దీనికోసం ఎదురుచూస్తున్నారు కాబట్టి సాధ్యమైనంత త్వరగా విడుదల చేస్తారు" అని అన్నారు.“సినిమా విడుదల ఆలస్యమైనంత మాత్రాన దాని ఫలితంపై ప్రభావం పడదు. దానికి వచ్చే ఓపెనింగ్స్ అలానే ఉంటాయి. కాకపోతే ముందు చెప్పిన తేదీకే విడుదలైతే ఆ రోజు కోసం అందరూ సిద్ధంగా ఉంటారు కాబట్టి రెవెన్యూ విషయంలో కొంచెం వ్యత్యాసం ఉంటుందంతే. రూ.3 నుంచి రూ.4 కోట్లు తేడా రావొచ్చంతే. పెద్ద సినిమాలు బాగున్నా, బాలేకపోయినా వాటికి వచ్చే రెవెన్యూ మొదటి మూడు రోజుల్లోనే వచ్చేస్తుంది" అని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు.




# నాకు ఎవరితోనూ పోటీ లేదు

మన పనిని పది మంది మెచ్చుకున్నప్పుడు వచ్చే ఎనర్జీనే వేరని అంటోంది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. ఇటీవలే ధనుష్‌తో కలిసి ‘తేరే ఇష్క్ మే’ చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిందీమె. ఇందులో ముక్తి పాత్రలో తనదైన నటనతో మెప్పించింది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి మాట్లాడుతూ.. “తేరే ఇష్క్ మే’ సినిమాకి ప్రశంసలు రావడం ఆనందంగా ఉంది. ఒక నటిగా నాకు ఇంతలా ప్రేమ దక్కుతుందని ఊహించలేదు. కెరీర్‌లో ఒక దశకు చేరుకున్నాక.. మన ప్రతిభేంటో ప్రేక్షకులకు తెలుసు అనే నమ్మకం కలుగుతుంది. ప్రస్తుతం నేను ఈ దశలోనే ఉన్నాను. ఇక్కడ నేను ఎవరితోనూ పోటీ పడటం లేదు. బాక్సాఫీస్ నంబర్ల కోసం పరుగెత్తడం లేదు. నా పనిని ఆస్వాదిస్తున్నా. వృత్తిలో ఇంకా మెరుగుపడాలనుకుంటున్నా" అని చెప్పుకొచ్చింది.






# శీతల భూతం
# చలి పంజా



- ఆదిలాబాద్ అంతటా గజగజ ■ సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు..
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 6.6 డిగ్రీల కనిష్ఠ టెంపరేచర్ ■ చలి పంజాకు వృద్ధుడి బలి..
- గిరిజన గూడేలను కమ్మేసిన మంచు తెరలు.. వణుకుతున్న జనం ■ చలి మంటలతో ఉపశమనం
- మరో మూడు రోజుల పాటు పెరగనున్న చలితీవ్రత ■ చలితీవ్రతతో జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

**అడవుల జిల్లా ఆదిలాబాద్ చలికి వణికిపోతోంది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు అమాంతంగా పడిపోవడం, కేవలం సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరాది నుండి వీస్తున్న చలి గాలులతో జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. కొన్ని రోజులుగా వరకు సాధారణ ఉష్ణోగ్రతలే నమోదు కాగా గత రెండు మూడు రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఏజె న్సీ ప్రాంతాల్లోనైతే చలి ఇబ్బంది అన్నీఇన్నీ కావు. చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోవడం తో ప్రజలు చలి నుండి రక్షణ కల్పించేందుకు చలి మంటలు కాగుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తె చలి నుండి రక్షణకు స్వెటర్లు, మఫ్లర్లను ధరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జనాలు లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. ఓవైపు పోగామంచు కమ్ముకున్న దృశ్యాలు ప్రజలను అనువిందు చేస్తున్నప్పటికీ, మరోవైపు పొగమంచు కారణంగా రహదారులు కనబడగా వాహనదారులకు ఇబ్బందులు కలుగుతూ, ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.**



**ఆదిలాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
అడవుల జిల్లా ఆదిలాబాద్ చలికి వణికిపోతోంది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు అమాంతంగా పడిపోవడం, కేవలం సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడంతో జనం తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఉత్తరాది నుండి వీస్తున్న చలి గాలుల తో జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. కొన్ని రోజులుగా వరకు సాధారణ ఉష్ణోగ్రతలే నమోదు కాగా గత రెం డు మూడు రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఏజె న్సీ ప్రాంతాల్లోనైతే చలి ఇబ్బంది అన్నీఇన్నీ కావు. చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోవడం తో ప్రజలు చలి నుండి రక్షణ కల్పించేందుకు చలి మంటలు కాగుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి



వస్తె చలి నుండి రక్షణకు స్వెటర్లు, మఫ్లర్లను ధరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జనాలు లేక రోడ్లన్నీ నిర్మాను ష్యంగా కనబడుతున్నాయి. ఓవైపు పోగామంచు కమ్ముకున్న దృశ్యాలు ప్రజలను అనువిందు చేస్తున్నప్పటికీ, మరోవైపు పొగమంచు కారణంగా రహదారులు కనబడగా వాహనదా రులకు ఇబ్బందులు కలుగుతూ, ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

**సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు...**
ఆదిలాబాద్ జిల్లాలో చాలా చోట్ల కేవలం సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు పరిమితం అయ్యాయి. రికార్డు స్థాయిలో ఉష్ణో గ్రతలు పడిపోవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నా రు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో అర్లి (టి)లో 6.8 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలికి తోడు పొగ మంచు కమ్ముకుపోవడంతో పలు పల్లెల్లో హాల్లదకరమైన వాతా వరణం దర్శనమిస్తోంది. కొండలు, గుట్టలు, లోయ ప్రాం తాల్లోనీ గ్రామాల్లో తెల్లవారుజామున పొగమంచు దుప్పటి కప్పినట్లుగా కనిపిస్తున్న దృశ్యాలు ప్రజలను కనువిందు చేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను చలి పులి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. మారుమూల గ్రామాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో జనాలు బయటకు రావ డానికి జంపుతున్నారు. చలి కారణంగా ఉదయం 9 గంటలకు సైతం ప్రజలు ఇంటి నుండి బయటకు రావడం లేదు. సాయంత్రం 5 గంటలలో ఇంటికి చేరుకుంటున్నారు. చలి నుండి రక్షణ పొందేందుకు ప్రజలు చలిమంటలు కాగుతున్న దృశ్యాలే ఎక్కడ చూసినా కనబడుతున్నాయి.

**పొగమంచుతో ప్రమాదాలు...**
గత కొన్ని రోజులుగా జిల్లాలో దట్టమైన పొగ మంచు కమ్ము కుంది. దీంతో రహదారులపై ప్రయాణించే వాహనదారుల కు రాకపో కలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దట్టమైన పొగ మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక తరచు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటు న్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారిపై పొగ మంచు తీవ్రంగా ఉండడంతో వానదారులు దినంలో సైతం వా హనాల లైట్లను వేసుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పొగ మంచు కారణంగా సోమవారం తెల్లవారు జామున గుడిహత్నూర్ మండలంలోని జాతీయ రహదా రిపై రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు. మహారాష్ట్ర నుండి హైదరాబాద్ వెళుతున్న కారు పొగ మంచుతో రోడ్డు కనబడ కపోవడంతో డివైడర్ ను ఢీకొని బోల్తా కొట్టి నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

**చలి పంజాకు వృద్ధుడు బలి..**
పెంబి మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన వృద్ధు డు కర్రె గంగారెడ్డి(60) చలి తీవ్రతకు బలయ్యాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా 6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గంగారెడ్డి మానసిక స్థితి బాగోలేకపోవ డంతో వారం రోజుల నుంచి పెంబి మండల కేంద్రంలోనే తిరుగుతున్నాడు. ఆదివారం రాత్రి పెంబి బస్టాండ్ సమీపంలో గల రోడ్డుపై చలిలోనే పడుకున్నాడు. ఉదయం స్థానిక ప్రజలు గమనించి వృద్ధుడిని లేపగా చలనం లేదు. దీంతో అతడు చలికి మృతిచెందినట్లు గుర్తించారు. గంగారెడ్డి భార్య గతేడాది అనారోగ్యంతో మరణించింది. వీరికి పిల్లలు, ఇల్లు కూడా లేదు.



## పాతబస్తాండ్‌లో రోడ్డు పనుల్ని అడ్డుకున్న వ్యాపారులు.. ఉద్రిక్తత

**బెల్లంపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ నడిబొడ్డున రోడ్డు విస్తరణ పనులు స్థానిక వ్యాపారులకు గిట్టడంలేదు. రోడ్డు విస్తరణ పను లు భాగంగా సోమవారం పాత బస్టాండ్ వద్ద జేసీబీ యంత్రంతో దుకాణాల కూల్చివేతకు మున్సిపల్ అధికారులు ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న వ్యాపారులంతా గుమిగుడి ఆందోళ నకు దిగారు. వ్యాపారులకు మున్సిపల్ అధికారులకు మధ్య కొం త సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకసారిగా పరిస్థితి అక్కడ ఉధృతంగా మారింది. వ్యాపారస్తులు జేసీబీ ముందు నిలబడి అడ్డుకున్నారు. ఎంతసేపటికి అక్కడి నుంచి వ్యాపారస్తులు కదల కపోవడంతో చేసేదేం లేక అక్కడి నుంచి మున్సిపల్ అధికారులు వెళ్లిపోయారు. దీంతో వ్యాపారస్తులు శాంతించి ఆందోళన విర మించారు. పాత బస్టాండ్ వద్ద వ్యాపారస్తులు రోడ్డు విస్తరణ పనులను అడ్డుకోవడంతో అక్కడి నుంచి విస్తరణ పనులను నిలిపివేసిన వెళ్లిపోయిన అధికారులు మరోవైపుగా కన్నాలబస్తి నుంచి రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం గమనార్హం. రోడ్డు విస్తరణ పనుల పట్ల మొదటి నుంచి వ్యాపారస్తులు అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు తమ పనులను యధావిధిగా కొనసాగిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులను వ్యాపారస్తులు చివరి ప్రయత్నంగా మరోసారి అడ్డుకో వడం పట్టణంలో చర్చనీయంశంగా మారింది. రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను వ్యతిరేకిస్తూ వ్యాపారస్తులు క్రియాశీల ఆందో ళనకు సిద్ధపడుతున్నారు. అందులో భాగంగా మంగళవారం పట్టణ వ్యాపార సముదాయాల బందుకు పిలుపునిచ్చారు. రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారస్తులు కార్యచరణ ఆందోళనకు బందుతో శ్రీకారం చుట్టనున్నారు.



## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**లక్ష్మణచాంద, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
లక్ష్మణాచాంద మండలం పీచర గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం షీ టీమ్ సిబ్బంది, భరోసా కేంద్రం ఆధ్వర్యంలో విద్యా ర్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిం చారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మే రకు జరిగిన ఈ కార్యక్రమంలో, సైబర్ మో సాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రోజు రోజు కు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమ త్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు.



## ఖోఖోలో విద్యార్థికి గోల్డ్ మెడల్

**లక్షెట్టిపేట, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
ఈ నెల ఐదు నుంచి ఏడవ తేదీ వరకు హైదరాబాద్ లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన అండర్ 19 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పట్టణంలోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థి జస్వంత్ బంగారు పథకం సాధించాడని ప్రిన్సిపాల్ మంగ సోమ వారం తెలిపారు. జస్వంత్ ను అండర్ 19 సెక్రెటరీ బాబురావు, ఏటీపీ తిరుమల, పిడి నాంపల్లి, పీఈటి రాజేష్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## ఏకగ్రీవ ఎన్నికతోనే గ్రామాల్లో ఐక్యత


### ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ఆదిలాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగితే గ్రామాల్లో ఐక్యత నెలకొంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామ సర్పంచ్‌గా రాథోడ్ శీలబాయి, వార్డు మెంబర్లుగా అంబాజి, పడిగెల రాము లు, రేవతి, దాసరి రవళి లను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కంటేగావ్ గ్రామ సర్పంచ్‌గా జాదవ్ సంజీవ్, ఉప సర్పంచ్‌గా సులోచన బాయి, వార్డు మెంబర్లుగా ఆడేం కవిత, జాదవ్ బలరాం, రాథోడ్ శంకర్, జాదవ్ సంతోష్, శంకరి, ఉమేష్, కుంరం గోదావరి లను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో సోమవారం వారిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆసుపత్రిలో బట్టలు ఉతికే యంత్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


**ముథోల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
భైంసా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సోమ వారం రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి న బట్టలు ఉతికే యంత్రాన్ని ప్రారంభించారు. రోగులకు ఇబ్బం దులు లేకుండా అన్ని ఏర్పా ట్లు చేస్తున్నామని, ఆసు పత్రిని ఆధునీకరించి మెరుగైన వైద్య సేవలు అంది స్తామని తెలిపారు. భైంసాలో ప్రసూతి ఆసుపత్రి ఏర్పా టుకు ఐదు ఎకరాల స్థలం సేకరించినట్లు చెప్పారు.



# ప్రలోభాల పర్వం షురూ..

## నేటితో ముగియనున్న తొలివిడత ప్రచారం

■ ఇప్పటికే గ్రామాల్లోకి మద్యం డంపు ■ ఒక్కో ఓటుకు వెయ్యి నుంచి 3 వేల వరకు పంచేందుకు ప్రణాళికలు
■ నగరాల్లో ఉండే ఓటర్లకు వల ■ ముందస్తుగా ఆన్‌లైన్ పేమెంట్ ■ ఎక్కడ చూసినా సిట్టింగులే..
■ ఒకరిని మించి ఒకరు ఖర్చు ■ ఆ ఓటరు నాడిని పట్టేందుకు అభ్యర్థుల చివరి ప్రయత్నం



**ఆదిలాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత నిర్వహించ నున్న గ్రామ పంచాయతీలకు నేటి సాయంత్రంతో ప్రచారం ముగనుంది. 11 వతేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులు చివరి అవకా శంగా ప్రలోభాలకు తెరలేపారు. నయానో భయానో ఎలాగై నా గెలిచితీరాలని డబ్బు, మద్యంతో ఓటర్లను ఆకట్టుకునేందు కు సర్వం సిద్ధం చేశారు. ఏ వాడ ఓటర్లకు ఆ వాడలో ప్రత్యేక సిట్టింగులు ఏర్పాటు చేసేందుకు మద్యం డంపింగ్‌లు చేసి వారికి తాగినంత అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జీవనో పాధి కోసం నగరాల్లో ఉన్న ఓటర్లకు ఫోన్ పే ఇతరత్రా ఆన్ లైన్ ద్వారా ముందస్తుగానే నగదును వారికి ముట్టజెప్పే ఏర్పా ట్లు ఇప్పటికే పూర్తి చేసుకున్నట్లు సమాచారం. గెలుపు కోసం అభ్యర్థులు ఒకరికి మించి ఒకరు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే ఓటర్ ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఉత్కంఠగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజర్వ్ స్థానాల్లో మాత్రం పోటీ మామూలుగానే సాగుతున్న జనరల్ స్థానాల్లో మాత్రం పోటీ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను తలపిస్తుంది. పంచాయతీ ఎన్నికల తొలి విడత పోరు తుది దశకు చేరుకుంది. తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో గ్రామ పం చాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నా యి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 48 గంటల ముం దే ఎన్నిక ప్రచారాన్ని ముంగించాల్సి ఉండగా మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికల ప్రచారానికి తెరదించాల్సి ఉంది. మరో వైపు మంగళవారం సాయంత్రం నుంచే ఎన్నికలు జరిగే మండలాల్లో మద్యం షాపులు మూసివేయనున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు మద్యం షాపులను మూసి వేస్తున్నారు.

వారం రోజులుగా ఎన్నికల ప్రచారం చేసిన పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నట్లు సమా చారం. ఓటర్లను మచ్చిక చేసుకోవటానికి ఎన్నికల మందు రోజు రాత్రి, తెల్లవారుజామున మద్యం, నగదు పంపిణీ చేయ టానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. మరో వైపు అధికార యంత్రాంగం పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లల్లో నిమగ్నమై ఉంది. పోలింగ్ నిర్వహించే పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. మండలాన్ని జోన్లు, రూట్లుగా విభజించారు. పోలింగ్ సామగ్రిని మండల కేంద్రంలో ప్రత్యేక గదుల్లో భద్రపరిచారు. బందోబస్తు కోసం పోలీసులను పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించారు. మండల కేంద్రాల్లో డిస్టిబ్యూషన్, రికవరీ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 10న ఉదయం నుంచి పోలింగ్ సామగ్రి, ఉద్యోగులను గ్రామ పంచాయతీలకు తరలించ నున్నారు.

**బ్యాలెట్ పేపర్‌పై తొలిసారి నోటాకు చోటు..**
స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసీ తొలిసారిగా బ్యాలెట్ పేపర్ నోటాకు చోటు కల్పించారు. ఎన్నికల్లో పోటీ చేసేందకు నిలబడిన అభ్యర్థులు వారికి నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అధికారాన్ని ఈసీ కల్పించింది. ఇప్పటి వరకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం మిషన్లలో మాత్రమే పొందు పరచగా తొలి సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ పై నోటాను చేర్చారు.

**పోలింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం..**
ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఈనెల 11 పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయటానికి అధికార యంత్రాం గం అన్ని ఏర్పాటు చేసుకుంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ ఆఫీసర్లకు ట్రైనింగ్ ఇచ్చారు. గ్రామ పంచా యతీ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. పోలింగ్ సామగ్రి ని భద్రపరిచారు. సామగ్రిని పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

**కార్యదర్శులపై ఆర్థిక భారం..**
పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు, ఏర్పాట్ల కోసం ప్ర భుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో కార్యదర్శుల పై ఆర్థిక భారం పడుతుంది. సర్పంచ్ తోపాటు వార్డు స్థానాలకు వేర్వురుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటి వద్ద ఓటర్ల కోసం వేసే టెంట్లు, కుర్చీలు, బెం చీలు, మంచినీటి సదుపాయాల కోసం నిధులు మంజూరు కాకపోవడంతో కార్యదర్శులే ప్రస్తుతం ఖర్చులు భరించే పరిస్థి తి ఉంది. ప్రతీ కార్యదర్శికి రూ.5 వేలపైనే ఆర్థికంగా భారం పడే అవకాశం ఉంది. కలెక్టర్ స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

## పులి పాదముద్రలను పరిశీలించిన ఫారెస్ట్ శిక్షణ బీట్ అధికారులు



**బెజ్జూర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 38 మంది బీట్ అధికారులు బెజ్జూరు అడవుల్లో పర్యటించి వివరాలను తెలుసుకొని క్షేత్ర పర్యటన చేశారు. ఫీల్డ్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్, స్థానిక అటవీ అధికారుల బృందంతో ఇక్కడి అటవీ ప్రాంత ప్రాముఖ్యతను వివరించారు. మండలంలో కృష్ణపల్లి సెక్షన్ పరిధిలోని ఇందురుగాం బీట్లోని రాముడు భీముడు టేకు చెట్లు, బేస్ క్యాంపును పరిశీలించారు. అనంతరం మాణిక్య దేవారా అటవీ ప్రాంతంలో పులుల ఆవాస ప్రాంతాన్ని పరిశీలించారు. పులుల కదలికలు, వాటి పాదముద్రలు పరి శీలించి వివరాలను తెలుసుకున్నారు. పెద్దపులి ఎటు నుంచి ఎటువైపు వెళుతుందో పాదముద్రల ఆధారంగా గమనిస్తూ వెళ్లారు. అంతేకాకుండా ఎక్కడి అటవీ ప్రాంతం జీవవైవిధ్యంతో కూడిందని ఈ ప్రాంతంలో వివిధ రకాల పక్షులు, వన్య ప్రాణుల గురించి వివరించారు. వారి వెంట రేంజ్ అధికారి ముసావీర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్, సెక్షన్ అధికారి సోఫియా, బీట్ అధికారి గోపాల్ ఇతర సిబ్బంది ఉన్నారు.



## బేల వైన్స్ షాప్‌లో భారీ చోరీ

### కౌంటర్‌లోని రూ. 3 లక్షల 15 వేలు నగదుతో పాటురూ. 20వేల మద్యం బాటిల్‌ల చోరీ

**బేల, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**
బేల మండల కేంద్రంలోని శ్రీ దుర్గ వైన్స్ షాప్ లో గత రాత్రి దొంగలు పడ్డారు. గత నెలలో టెండర్ దక్కించుకున్న యజమాని వైన్స్ ప్రారంభించిన కేవలం వారం రోజులోనే దొంగతనం జరిగింది. షాప్ యాజమాని బాల్‌రాజ్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం వైన్స్ షాప్‌ను ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఎస్.ఐ తెలిపిన వివరాల ప్రకారం... దొంగలు వైన్స్ వెనకాల ఉన్న వెంటిలెటర్‌ను తొలగించి లోనికి చొరబడ్డారన్నారు. సీసీ కెమెరాలు పగల గొట్టి ఉండడంతో క్లూస్ టీమ్, డాగ్ స్కాడ్ లతో తనిఖీలు చేపట్టారు. షాప్‌లోని వస్తువుల పైనా వేలిముద్రాలను సేకరించారు. కౌంటర్‌లోని రూ. 3 లక్షల 15 వేలు నగదుతో పాటురూ. 20వేల మద్యం బాటిల్ చోరికి గురైయ్యాయని వైన్స్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ తెలిపారు.

# ఈఎస్ఐ భవన నిర్మాణానికి కృషి

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



**కాగజ్‌నగర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి నూతన భవనం మంజూరు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని శిథిలావస్థకు చేరిన ఈఎస్ఐ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జగన్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒకప్పుడు పట్టణంలో వేలాది మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించిన ఈఎస్ఐ ఆసుపత్రి ప్రస్తుతం వెలవెలబోతుందని, భవనం సైతం శిథిలావస్థకు చేరిందన్నారు. నూతన భవన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈఎస్ఐ నూతన భవన నిర్మాణానికి కసరత్తు జరుగుతోందన్నారు. ఆసుపత్రి ఇతర భవనంలోకి తరలించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి వేసి 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టను న్నట్లు వివరించారు. డయాగ్నోస్టిక్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

**సామాజిక స్పృహ కలిగిన అభ్యర్థులను గెలిపించండి..**

సామాజిక స్పృహ, బాధ్యత కలిగిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సూచించారు. దహెగాం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమని, అలాగే జాతీయ ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించేది కూడా కేంద్ర ప్రభుత్వమే నని అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల బలోపేతం కోసం ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద బీటీ రోడ్లు వేయనున్నామని తెలిపారు. పీపీ రావు కాలనీ నుంచి సుర్దాపూర్ వరకు వయా హత్తిని మీదుగా హమ్ పథకం ద్వారా రోడ్డు మంజూరు అయిందని త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. కల్వాడ నుంచి ఒడ్డుగూడ వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, తిరుపతి, దామోదర్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, వినోద్, శ్రీకాంత్, హరీష్‌గౌడ్, అరవిందగౌడ్, వెంకటేష్, సత్యం, ప్రదీప్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు. బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని అచ్చెల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నిధులతో అభివృద్ధికి పాటు పడుతామని అన్నారు. ఆరెగూడలో రూ. 2.50 కోట్లతో సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులు త్వరలోనే చేపడాతమని తెలిపారు. అంతకుముందు గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట నాయ కులు శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## చట్టానికి లోబడి వ్యవహరించాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ బురుగుడలో సోమవారం తన సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఏ ఒక్కరికో సొంతం అనుకుంటే పొరపాటేనని, యావత్ ప్రజానీక శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసులు ముందుంటున్నారని తెలిపారు. పోలీసులు నిత్యం ప్రజల వెన్నంటి ఉంటారనే నమ్మకాన్ని కలిగించడమే ఫ్లాగ్ మార్చ్ లక్ష్యమని పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులంతా ఎన్నికల నియమాల లోబడి నడుచుకోవాలని అన్నారు. సమస్యలు సృష్టించే వారిని గుర్తిస్తూ ముందస్తుగా తహశీల్దార్ ముందు బైండోవర్ చేస్తున్నామని తెలిపారు.

## నేడు బెల్లంపల్లి పట్టణ బంద్‌కు పిలుపునిచ్చిన వ్యాపారులు



**బెల్లంపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

రోడ్డు విస్తరణ పనులను వ్యతిరేకిస్తూ నేడు బెల్లంపల్లి పట్టణ వ్యాపారులు బంద్‌కు పిలుపునిచ్చారు. పట్టణంలోని అన్ని వర్గాల వ్యాపారులు బంద్‌కు సహకరించాలన్నారు. మున్సిపాలిటీ అధికారుల తీరును నిరసిస్తూ బంద్ కు పిలుపునిచ్చారు. వ్యాపారస్తులను ఇబ్బందికి గురిచేస్తూ రోడ్డు వెడల్పు పనులు చేపట్టారని వారు ఆరోపించారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల తీరుకు నిరసనగా తల పెట్టిన పట్టణ బంద్‌కు సహకరించి విజయవంతం చేయవలని కోరారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

**కాగజ్‌నగర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు జోనల్ స్థాయి అండర్-14 బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కాగజ్‌నగర్ రూరల్ సీఐ కే. కుమారస్వామి, రూరల్ ఎస్ఐ సందీప్‌కుమార్ ప్రారంభించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన అండర్-14 విభాగంలో విక్రమ్ తేజ 28-30 కిలోల వర్గంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అలాగే అండర్-19 విభాగంలో సుమిత్ తివారి 63-67 కిలోల వర్గంలో గోల్డ్, అంకిత్ 57-60 కిలోల వర్గంలో గోల్డ్, ప్రభాత్ 69-75 కిలోల వర్గంలో గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు. త్వరలో వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో వీరు పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూర్ల మధు, సెక్రటరీ మధురై శేఖర్, జెడ్పీఎస్ పీడీ ఇంద్ర, సీనియర్ పీడీ సంభాషరావు, సీనియర్ బాక్సర్లు సాయి, శివ, వంశీ పాల్గొన్నారు.



# నిర్భయంగా ఓటు హక్కును వినియోగించాలి

## మంచిర్యాల డీసీపీ భాస్కర్



**దండేపల్లి, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

స్వేచ్ఛగా, భయం లేకుండా బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ కోరారు. సోమవారం మంచిర్యాల జిల్లా దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ కాసిపేట్, దండేపల్లి గ్రామాల్లోనీ సున్నిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్ తో కలిసి సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఎలాంటి ఒత్తిడులు, బెదిరింపులు లేకుండా మీకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. గ్రామాల్లో ఎవరికైనా ఎన్నికల ప్రచారం చేయడానికి పూర్తిగా స్వేచ్ఛ ఉంటుందని శాంతియుత వాతావరణంలో పారదర్శక ఎన్నికల కోసం తగిన బందోబస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, భద్రత, సరైన బారి కేడింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందేది ఓటు హక్కుతోనేనని, అందరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించూకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్ఐ తైహిసినోద్దీన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నేడు నిర్మల్‌కు రానున్న 300 మంది సాధువులు

**నిర్మల్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

ఉత్తర భారతదేశం నుంచి 300 మంది సాధు, సంతవులు, సిద్ధ పురుషులు గోదావరి పరిక్రమణ (ప్రదక్షిణ) నిమిత్తం చేపట్టిన యాత్ర నేడు నిర్మల్ పట్టణానికి చేరుకుంటుందని స్వాగత కమిటీ సభ్యుడు అరుణ్ శర్మ తెలిపారు. గోదావరి నది జన్మస్థలమైన నాసిక్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర బాసర మీదుగా కాళేశ్వరం చేరుకుని, అక్కడి నుంచి భద్రాచలం తర్వాత రాజమండ్రి అంతర్వేదిలో సముద్రంలో కలుస్తుందన్నారు. మొత్తం ఈ యాత్ర 15 రోజుల పాటు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా మంగళవారం నిర్మల్‌కు చేరుకుంటుందన్నారు. రాజాశ్యామల పీఠం, మహాదేవ శక్తి సంసాన్ ట్రస్టు ఆధ్వర్యంలో వారికి స్థానిక ఈద్గామ్ చౌరస్తా వద్ద స్వాగతం పలికి, భారీ శోభయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, వ్యాపార, కుల, ఉద్యోగ సంఘాలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని, ఆశీర్వచనం పొందాలని కోరారు.

# అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఈత పోటీలు

**ఆదిలాబాద్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రం సమీపంలోని ఓ ఇంటర్నేషనల్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఈత పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 400 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అత్యుత్తమ టైమింగ్స్ సాధించిన క్రీడాకారులు ఈ నెల 21, 22 తేదీల్లో హైదరాబాద్లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే దక్షిణ భారత స్థాయి ఈత ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనను న్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



# పోటీ నుంచి తప్పుకోకపోతే చంపేస్తాం

## ట్రాన్స్ జండర్‌ను బెదిరించిన ప్రత్యర్థి అభ్యర్థి
## కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన ట్రాన్స్ జెండర్

**జైనూర్, డిసెంబర్ 8 (ప్రభాత సమాచారం)**

సర్పంచ్ ఎన్నికల్లో పోటీలో నుంచి తప్పుకోకపోతే చంపేస్తామంటు ఓ ట్రాన్స్ జెండర్ని ప్రత్యర్థి అభ్యర్థి బెదిరించిన సంఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో చోటుచేసుకుంది. జైనూర్ మండలం మార్లవాయి గ్రామ పంచాయితీలో జరుగుతున్న మొదటి విడుత సర్పంచ్ ఎన్నికల్లో ట్రాన్స్ జెండర్ సాధన (సంతోష్) నామినేషన్ వేశారు. ఈమె నామినేషన్ను విత్ డ్రా చేసుకోవాలని మొదట ఒత్తిడి తెచ్చారు. అయినా సాధన భయపడకుండా నామినేషన్ విత్‌డ్రా చేసుకోలేదు. ఈమె వేసిన నామినేషన్ను పరిశీలించిన అధికారులు ఎన్నికల్లో గుర్తుని కూడా కేటాయిం చారు. దీంతో సాదన ఎన్నికల్లో ముమ్మరంగా ప్రచారాన్ని చేస్తుండటంతో ప్రజల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. దీనికి చూసిన ప్రత్యర్థి అభ్యర్థులు ఈమెను ప్రచారం చేయకుండా అడ్డుకుంటున్నారు. ఈమె ప్రచా రం కోసం అంటించిన పోస్టర్లను, బ్యానర్లను చింపివేస్తున్నారని, ఎన్నికల్లో ప్రచారం చేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రత్యర్థి అభ్యర్థుల నుంచి వస్తున్న బెది రింపు కాల్స్ గురించి జైనూర్ ఎస్సై ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ఎస్సై తననే తిట్టి పంపించివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తనకు ప్రత్యర్థి అభ్యర్థి నుంచి తనను చంపుతామని వస్తున్న బెదిరింపు కాల్స్ గురించి తన వద్ద రికార్డులు కూడా ఉన్నాయని తెలిపారు. తను ప్రచారం చేయకుండా భయ భ్రాంతుల కు గురిచేస్తున్న వారిపై జిల్లా కలెక్టర్ తోపాటు, ఎస్సీకి ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ అభ్యర్థి సాధన (ట్రాన్స్ జెండర్) తెలిపారు.

